E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

99598I294I-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :283 సోమవారం 21 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనమే

- అసెంబ్లీపై బండి సంజయ్ ఫైర్
- ఆరు గ్యారెంటీలపై చర్చేదీ?
- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై ఆగ్రహం
- బీజేపీకి మాట్లాడే ఛాన్స్ లేదని విమర్శ
- ఫామ్‌హౌస్ పర్యటనలపై ప్రశ్నలు
- భూదోపిడీపై ఆధారాలు బయటపెట్టాలి
- 22ఏ సమస్యపై న్యాయపోరాటం
- ఉప ఎన్నికపై కాంగ్రెస్‌కు సవాల్



## విద్యా వ్యవస్థకు రాజకీయాలు దూరం

- విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలన్న లోకేష్
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు
- విద్యార్థులు క్షణికావేశ నిర్ణయాలు తీసుకోవద్దని సూచన
- ఫెయిల్యూర్ కసిని పెంచుతుందన్న మంత్రి
- క్లాస్‌రూమ్ నుంచే సామాజిక మార్పు సాధ్యమని వెల్లడి
- దేశభక్తి, నైతిక విలువలే కుటుంబ వ్యవస్థకు పునాది 2 లో
- విలువలతో ఎదిగి దేశానికి గర్వకారణంగా నిలవాలని పిలుపు

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు డ్రా!

- క్యూర్ పరిధిలో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పూర్తి
- ఈ నెల 30లోగా లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు
- పారదర్శకంగా డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాల నమోదుకు సూచన
- 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధి వారికి ప్రాధాన్యం
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- అనర్హుల తొలగింపు.. అర్హులకు ఇళ్ల కేటాయింపు 2 లో

## సర్కారు ఖజానాకు భారీ ఊపు!




- ఆగస్టులో రాష్ట్ర ఖజానాకు రూ.17,893 కోట్ల రాబడి
- ఐదు నెలల్లో ప్రభుత్వానికి రూ.77,535 కోట్ల ఆదాయం
- నెలకు సగటున రూ.15,507 కోట్ల ఆదాయం
- ఐదు నెలల్లో రూ.34,285 కోట్ల అప్పులు
- జూలైతో పోలిస్తే ఆగస్టులో తగ్గిన అప్పులు
- నాన్‌ట్యాక్స్ రెవెన్యూలో 5 శాతం వృద్ధి
- ట్యాక్స్, జీఎస్టీ ఆదాయాల్లోనూ వృద్ధి నమోదు

## ధాన్యం కొనుగోళ్లకు భారీ ఏర్పాట్లు!

- 65 లక్షల టన్నుల ధాన్యం అంచనా
- అక్టోబర్‌లో కొనుగోళ్లకు శ్రీకారం
- ఎస్‌హెచ్‌టీ విధానంతో వేగం
- నిల్వలకు భారీగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- మిల్లులు, షెడ్లలో ధాన్యం నిల్వ
- ప్రతి వాహనానికీ జీపీఎస్ ట్రాకింగ్
- యాప్‌తో మిల్లులపై ఆకస్మిక తనిఖీలు
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోంది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా, కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడా నిలిచిపోకుండా వేగంగా మిల్లులకు తరలించేందుకు కొత్త వ్యూహాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.స్టీఫెన్ రవీంద్ర శనివారం ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. అక్టోబరు మొదటి వారం నాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు ప్రారంభించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌టీ (స్టోరేజ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్) విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

## మిడిల్‌ఈస్ట్‌లో మళ్లీ మంటలు!

- కోడ్ 100 అలెర్ట్‌లో ఇరాన్
- వైట్‌హౌస్‌కు అత్యవసరంగా ట్రంప్
- స్వదేశానికి నెతన్యాహు పయనం
- విమాన మార్గాల మూసివేత భయం
- అమెరికన్లకు విదేశాంగ శాఖ హెచ్చరిక 2 లో
- అంతర్జాతీయ ప్రయాణాలకు తీవ్ర విఘాతం



# భూమిపై భరోసా పొంగులేటి హామీ!

- అంగుళం భూమి కూడా తీసుకోం
- దళితుల భూములకు ఫుల్ భరోసా
- భయపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంది
- భూ హక్కులకు ఢోకా లేదు
- రీ-సర్వే.. హక్కుల కోసమే
- విషప్రచారాలను నమ్మొద్దు
- దళితుల భూములపై పక్కా హామీ
- భూమి మీది.. హక్కు మీది
- భూములు లాక్కునే ప్రసక్తే లేదు

**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని, వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దళితుల భూములకు సంపూర్ణ రక్షణగా నిలుస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల క్రితం దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎప్పుడూ ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయని తెలిపారు.

మిగతాది 2 లో..

## సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్

- పాక్, టర్కీకి హౌతీల వార్నింగ్
- సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్
- 'ఉక్కు పిడికిలి'తో దాడి చేస్తాం
- యుద్ధంలో జోక్యం వద్దన్న హౌతీలు
- తటస్థంగా ఉండాలని సూచన
- మక్కా రక్షణ ఒప్పందంతో వేడి
- సౌదీకి సైనిక సాయం సంకేతాలు
- డ్రోన్లు, క్షిపణులతో హౌతీల దాడులు




**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** యెమెన్ కు చెందిన హౌతీ రెబల్స్.. పాకిస్థాన్, టర్కీ దేశాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. సౌదీ అరేబియా కు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా 'ఉక్కు పిడికిలి' తో బదులిస్తామని స్పష్టంచేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి.

హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్-బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలలో ఈ హెచ్చరికలు చేశారు. 'దేవుడి సాక్షిగా చెబుతున్నా. ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం' అన్నారు.

## ప్రపంచానికి పెట్రోల్ షాక్!



**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** మిడిల్ ఈస్ట్‌లో అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఘర్షణ ముదరడం, అలాగే హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఒక్కసారిగా తీవ్రమైన ఇంధన సంక్షోభం తలెత్తింది. దీని ప్రభావం వల్ల అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ లాంటి పెద్ద పెద్ద అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇంధన కొరతతో, రికార్డు స్థాయి ధరలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. అనేక దేశాల్లో డీజిల్ దొరకడమే కష్టమైపోయి, చాలా చోట్ల పెట్రోల్ బంకులు మూతపడే పరిస్థితికి వచ్చాయి. అమెరికాలో పరిస్థితి చూస్తే చాలా దారుణంగా ఉంది. అక్కడ డీజిల్ సగటు ధర గాలన్‌కు 6.49 (మన భారతీయ కరెన్సీలో సుమారు రూ.622) అనే ఆల్-టైమ్ రికార్డు స్థాయికి చేరింది.

## కుప్పం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్!




**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారికంగా అనుమతులు లభించాయి.

## కార్యకర్తలకు పేర్ని నాని పిలుపు!



- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు
- సైనికుల్లా కష్టపడాలని కార్యకర్తలకు పేర్ని నాని సూచన
- ఓటర్లతో మమేకమై ప్రేమను సంపాదించుకోవాలని సూచన
- ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై పోరాడాలని దిశానిర్దేశం
- రాష్ట్రంలో ఎరువుల కొరతపై పేర్ని నాని ఆందోళన
- యూరియా, డీఏపీ కోసం రైతుల ఇబ్బందులు
- యాప్ ద్వారా ఎరువుల విక్రయంపై పేర్ని నాని విమర్శలు

# మిడిల్‌ఈస్ట్‌లో మళ్లీ మంటలు!



**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** పశ్చిమాసియాలో మరోసారి యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో భౌగోళిక రాజకీయ పరిస్థితులు మళ్లీ అత్యంత ఆందోళనకరంగా మారాయి. ఇరాన్, దాని ప్రాక్సీ దళాలు, అమెరికా–ఇజ్రాయెల్ కూటమి మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో ఈ ప్రాంతంలో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రాబోయే సైనిక ముప్పును ముందస్తుగా ఊహిస్తూ ఇరాన్ తన సాయుధ బలగాలను తీవ్ర హెచ్చరిక హోదాలో (కోడ్ 100 అత్యవసర అలెర్ట్) ఉంచింది. తమ రక్షణ వ్యవస్థలను సిద్ధం చేయడంతో పాటు సైన్యానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. పరిస్థితుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన క్యాంప్ డేవిడ్ పర్యటనను వెంటనే రద్దు చేసుకుని, అత్యవసరంగా వైట్ హౌస్‌కు చేరుకున్నారు. అలాగే, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు కూడా తన అమెరికా పర్యటనను మధ్యలోనే ముగించుకుని అత్యవసరంగా స్వదేశానికి తిరుగుపయనమయ్యారు.

మరోవైపు యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాలోని కీలక విమానాశ్రయాలు, రక్షణ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. ఈ పరిణామాల వల్ల పశ్చిమాసియా మీదుగా వెళ్లే వైమానిక మార్గాలను మూసివేసే అవకాశం ఉందని జాతీయ మీడియాలో కథనాలు పేర్కొన్నాయి. దీనివల్ల అంతర్జాతీయ విమానాల రద్దు, ప్రయాణాలకు తీవ్ర విఘాతం కలగనుంది. విదేశాల్లోని తమ రాయబార కార్యాలయాలపై దాడులు జరిగే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ శాఖ హెచ్చరించింది. విదేశాల్లో ఉన్న అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అదేవిధంగా సౌదీ అరేబియాలో నివసిస్తున్న తమ పౌరులు జాగ్రత్తగా ఉండాలని ఇటలీ ప్రభుత్వం కూడా ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసింది.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు డ్రా!




**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** గత ప్రభుత్వం మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సెక్రెటేరియట్‌లోని తన కార్యాలయం నుంచి రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, వాటర్ వర్క్స్, విద్యుత్ అధికారులతో హౌసింగ్ సెక్రెటరీ వీపీ గౌతమ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆనాటి ప్రభుత్వం ప్రారంభించి వదిలేసిన ఇళ్లను తామెందుకు పూర్తిచేయాలన్న భేషజాలకు పోకుండా ఒక్క క్యూర్ పరిధిలోని 26 ప్రాంతాల్లో 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తిచేశామని ప్రకటించారు. పూర్తి చేసిన వాటికి ఈనెల 30వ తేదీలోగా పారదర్శకంగా డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.

2బీహెచ్‌కే ఇళ్లు ఉన్న ప్రాంతానికి 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో ఉన్నవారినే ఎంపిక చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలలో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వాటర్ వర్క్స్, ఆర్ డబ్ల్యుఎస్ , విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకొని వచ్చేనెలాఖరులోగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉన్న అనర్హులను తొలగించాలని.. ఆ ఇళ్లలో నివసించని వారికి ఫైనల్ నోటీస్ ఇచ్చి రద్దు చేయాలని ఆదేశించారు. నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దుచేసి వారి స్థానంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలో ఇంటిస్థలాలు ఉండి అర్హులైన దాదాపు 9వేల మందికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇన్‌చార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక, మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులకు సూచించారు.

# సర్కారు ఖజానాకు భారీ ఊపు!




**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నెలలోనే సుమారు 18వేల కోట్ల ఆదాయం వచ్చింది. కాగా, గత ఆగస్టులో రూ.17,893 కోట్ల ఆదాయం సమకూరినట్టు కాగ్?నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని ఐదు నెలల కాలంలో రూ.77,535 కోట్లు వచ్చినట్టు ప్రకటించింది. కాగా, ప్రభుత్వ ఆదాయం సగటున నెలకు రూ.15,507కోట్ల ఆదాయం వచ్చింది. ఆదాయం కాకుండా అప్పులు రూ.34,285 కోట్లు తీసుకొచ్చినట్టు వెల్లడించింది. జులైతో పోలిస్తే ఆగస్టులో అతి తక్కువగా అప్పులు తీసుకున్నది. నాన్ టాక్స్ రెవెన్యూలోనూ జులైతో పోలిస్తే ఆగస్టులో ఆదాయం తక్కువ ఉన్నా... గతేడాది కంటే దాదాపు ఐదుశాతం వృద్ధి నమోదైంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి వార్షికపరంగా చూస్తే గతేడాది కంటే రూ.30వేల కోట్లకుపైగా అధికాదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

దీంతో ప్రభుత్వానికి కొద్దిగా ఆర్థిక ఇబ్బందులు లేకుండా వెసులుబాటు దొరుకుతుందని భావిస్తున్నారు. గత జూలైలో ప్రభుత్వానికి నాన్ టాక్స్ రెవెన్యూతో కలిసి రూ.17,117 కోట్ల ఆదాయం వచ్చింది. జులైలో నాన్ టాక్స్ రెవెన్యూ రూ.1,577 కోట్ల మేర వచ్చింది. ఆగస్టులో మాత్రం రూ.1,201 కోట్ల ఆదాయం వచ్చినట్టు కాగ్ వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెరుగైనస్థితి ఉందని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. టాక్స్ రెవెన్యూలో 3.9శాతం, జీఎస్టీలో 4.78 శాతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లలో 6.18శాతం, సేల్స్‌టాక్స్ 3.83శాతం వృద్ధి నమోదైందని కాగ్‌తన నివేదికలో స్పష్టం చేసింది.

# తీవ్ర తాగునీటి సంక్షోభం..

మొదటి పేజీ తరువాయి

కొన్ని ప్రాంతాల్లో కుళాయి నీరు పది నిమిషాలు కూడా రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. అదీ నిర్దిష్ట సమయానికి కాకుండా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు లేకపోవడంతో బోర్లు కూడా ఎండిపోయాయని స్థానికులు చెబుతున్నారు. గ్రేటర్ విశాఖలోని ఆరు నియోజకవర్గాల్లోనూ నీటి సమస్య తీవ్రంగా ఉందని.. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖ ఉత్తర నియోజకవర్గంలోనూ తాగునీటి కొరత వేధిస్తోందని పేర్కొన్నారు. దీనితో వెంటనే నీటి సరఫరాను మెరుగుపరచాలని సీఎం చంద్రబాబును ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

విశాఖలో పర్యటించిన సీఎం చంద్రబాబు తాగునీటి సమస్యపై స్పందించారు. ఈ ఏడాది నీటి కొరత ఉందని అంగీకరించిన ఆయన.. వచ్చే ఏడాది నుంచి విశాఖ నగరానికి నీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. మరోవైపు చంద్రబాబు వ్యాఖ్యలపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఏడాది విశాఖ ప్రజలకు తాగునీరు అందించలేమని ప్రభుత్వం చెబితే.. అసలు ప్రభుత్వం ఎందుకు ఉందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. పెద్ద నగరంలో కనీసం తాగునీరు కూడా సరఫరా చేయలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన విమర్శించారు. వర్షాకాలంలోనూ విశాఖలో ఈ స్థాయిలో నీటి సంక్షోభం ఎప్పుడూ చూడలేదని వైసీపీ నేతలు, నగరవాసులు పేర్కొంటున్నారు.

# భూమిపై భరోసా.. పొంగులేటి హామీ!

మొదటి పేజీ తరువాయి

దేశంలో, రాష్ట్రంలో పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తుచేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములు ఇచ్చి ఆ భూమిపై హక్కు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రిగా మాటిస్తున్నా..

తెలంగాణ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూముల పంపిణీ, అలాగే పోడు భూముల విషయంలో గిరిజనులకు సుమారు 2 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు. భూమిలేని వారికి భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానం అని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిన దొరవారి మాటలు నమ్మకూడదని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున దళిత కుటుంబాలకు తాను స్పష్టమైన హామీ ఇస్తున్నానని "మీ అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని ఆయన అన్నారు.

భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని మంత్రి అన్నారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారని, తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ఎవరో ఏదో చెప్పారని భయపడాల్సిన అవసరం లేదు. మీ భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇస్తోంది. వాస్తవాలను తెలుసుకోకుండా ఎలాంటి విషప్రచారాన్ని నమ్మవద్దు. " అని మంత్రి పేర్కొన్నారు. దళితులను రెచ్చగొట్టి వారి భూముల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే ప్రయత్నాలను అర్థం చేసుకోవాలని అన్నారు.

ప్రభుత్వం అండ..

ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా భూములపై హక్కులు లేక ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమైన దళిత, గిరిజనులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. రీ–సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళిత, గిరిజనులకు వారి భూములపై హక్కులను కల్పించి మరింత పటిష్టం చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంఅని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దళిత కుటుంబాలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.


# ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనమే



**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** కేసీఆర్ కుటుంబ ఫామ్ హౌస్ లను పర్యాటక కేంద్రాలుగా మారుస్తున్నారా అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో బండి సంజయ్ మాట్లాడుతూ.. అసలు అసెంబ్లీ సమావేశాలు జరగలేదని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ప్రజల ఆలోచనల గురించి చర్చ జరిగినప్పుడు, ఇచ్చిన హామీల అమలు గురించి మాట్లాడినప్పుడు సమావేశాలు జరిగినట్టు అని చెప్పారు. కానీ అసెంబ్లీ సమావేశాలు అలా జరలేదని చెప్పారు. అసెంబ్లీ నుండి బీఆర్ఎస్ పార్టీని సస్పెండ్ చేశారని అన్నారు. ఉన్న బీజేపీ పార్టీకి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. పూర్తిగా వన్ సైడ్ అసెంబ్లీ జరుపుకున్నారని, మమ అనిపించారని వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో అసలు చర్చ జరగలేదని అన్నారు. ఆరు గ్యారెంటీల గురించి కాంగ్రెస్ పార్టీ మాట్లాడటంలేదని, అభివృద్ధి గురించి ఇచ్చిన హామీల గురించి మాట్లాడటంలేదన్నారు. కానీ ఇప్పుడు ఫామ్ హౌజ్ ల పర్యటనలకు వెళుతున్నారని చెప్పారు.

ఫామ్ హౌస్ లను ఏమైనా పర్యాటక కేంద్రాలుగా మారుస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రైవేట్ వ్యక్తుల ఫామ్ హౌస్ లకు వెళ్లే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డే అసెంబ్లీలో తమ వద్ద కబ్జాలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని చెప్పారని, ఆధారాలు ఉంటే భూములను వెనక్కి తీసుకోవాలన్నారు. కానీ అలా చేయకుండా బీఆర్ఎస్ నేతలకు డబ్బులు ఇచ్చేందుకు ఛాన్స్ ఇచ్చారని, డబ్బులు ముడితే పంచాయితీ క్లోజ్ అని ఆరోపించారు. భూదోపిడీ జరిగితే ఆధారాలతోసహా బయటపెట్టాలని, భూముల స్వాధీనంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. 22ఏతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్ కు లేదని చెప్పారు. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌ను రాజకీయ నిమజ్జనం చేయడం తథ్యమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తమకు పోటీ కానేకాదని, బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ను జనం అసహ్యించుకుంటున్నారని అన్నారు.

# విద్యా వ్యవస్థకు రాజకీయాలు దూరం



**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** కాకినాడలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా చాగంటి కోటేశ్వరరావు గోశాల ప్రాంగణంలో విద్యార్థులతో వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్య, ప్రభుత్వ స్కూళ్లు అంటే సీఎంకు చాలా ఇష్టం అని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగాయని, ఫెయిల్యూర్ మనలో కసిని పెంచుతుందని అన్నారు. విద్యార్థులు క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

దేశం అభివృద్ధి చెందాలంటే సంస్కరణలు రావాలని అన్నారు. మనమంతా దేశం కోసం పోరాడుదామని లోకేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే దేశంలోనే నెం.1గా ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ నిలుస్తుందని చెప్పారు. క్లాస్ రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యం అవుతుందని, అందుకే విద్యాశాఖ ఎంచుకున్నట్టు తెలిపారు. దేశభక్తి, నైతిక విలువలే మన కుటుంబ వ్యవస్థకు పునాది అని వ్యాఖ్యానించారు. త్యాగధనులే మన మార్గదర్శకులు.. వారి బాటలో పయనిద్దామని సూచించారు. విలువలతో ఎదగాలని, తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని అన్నారు.

# ప్రపంచానికి పెట్రోల్ షాక్!

మొదటి పేజీ తరువాయి

ఈ సంక్షోభం మొదలవ్వకముందు, అంటే ఫిబ్రవరి 27న డీజిల్ ధర గాలన్‌కు 3.75 (సుమారు రూ.360) మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు ఏకంగా 73 శాతం పెరిగిపోయింది. ఇక కాలిఫోర్నియా రాష్ట్రంలోనైతే పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడ డీజిల్ గాలన్‌కు 8.41 (సుమారు రూ.807) పలుకుతుంటే, పెట్రోల్ ధర 6.13 (సుమారు రూ.588)కి చేరింది. అమెరికాలో లారీలు, గూడ్స్ రైళ్లు, వ్యవసాయ యంత్రాలు.. ఇలా సరుకు రవాణా అంతా డీజిల్‌పైనే ఆధారపడి నడుస్తుంది. దాంతో డీజిల్ ధరలు మంట పుట్టించడంతో అక్కడ సరుకు రవాణా ఛార్జీలతో పాటు నిత్యావసరాల ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి.

ఇటు ఫ్రాన్స్‌లో కూడా ఇంధన కొరత ముదిరిపోయింది. ఎంతలా అంటే, అక్కడ ప్రతి తొమ్మిది పెట్రోల్ బంకుల్లో ఒక బంకు (దాదాపు 11 శాతం) పూర్తిగా ఖాళీ అయిపోయింది. కొన్ని ప్రాంతాల్లోనైతే ఏకంగా 16 శాతం బంకుల్లో లీటర్ ఆయిల్ కూడా దొరకడం లేదు. ఫ్రాన్స్‌లో డీజిల్ సగటు ధర లీటరుకు 2.39 యూరోలు (సుమారు రూ.264) దాటి రికార్డు సృష్టించింది. దేశంలోని 700 కంటే ఎక్కువ బంకుల్లో ప్రీమియం గ్రేడ్ ఇంధనం లీటరుకు 2.50 యూరోల (సుమారు రూ.276) నుంచి 2.70 యూరోల (సుమారు రూ.298) వరకు విక్రయిస్తున్నారు. సవూదీ అరామ్‌కోకు చెందిన ఈస్ట్–వెస్ట్ పైప్‌లైన్‌పై జరిగిన దాడి వల్ల, అక్టోబర్ నెలకు సంబంధించిన క్రూడ్ ఆయిల్ సప్లైని నిలిపివేస్తున్నట్లు కనీసం ఇద్దరు పెద్ద యూరోపియన్ రిఫైనర్లకు సమాచారం అందించారు. ఇది ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేసింది. ఈ ఊహించని పరిస్థితి నుంచి బయటపడేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మేక్రాన్ జీ–7 దేశాలను తమ దగ్గరున్న అత్యవసర వ్యూహాత్మక చమురు నిల్వలను (ఎమర్జెన్సీ ఆయిల్ రిజర్వ్స్) మార్కెట్లోకి విడుదల చేయాలని కోరారు.

మరోవైపు బ్రిటన్ కూడా ఈ ధరల మంటల్లో చిక్కుకుంది. అక్కడ ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 3.1 శాతానికి పెరిగింది. దీనికి ప్రధాన కారణం పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, అలాగే విమాన ప్రయాణ ఛార్జీలు ప్రియం కావడమే. ఆ దేశ జాతీయ గణాంకాల కార్యాలయం అందించిన వివరాల ప్రకారం.. గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే వాహనాల ఇంధన ధరలు ఏకంగా 23 శాతం పెరిగాయి. జూలై నుంచి ఆగస్టు మధ్యలోనే పెట్రోల్ సగటు ధర లీటరుకు 9.1 పెన్స్ పెరిగి 161.3 పెన్స్‌కు (సుమారు రూ.206) చేరుకుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభంలో నమోదైన రికార్డు ధరల తర్వాత, పెట్రోల్ ధరలు ఈ స్థాయిలో పెరగడం మళ్లీ ఇప్పుడే. ఇక, అసలు ప్రపంచ వ్యాప్తంగా ఈ స్థాయిలో ఇంధన సంక్షోభం రావడానికి ప్రధాన కారణం హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో చమురు రవాణా నిలిచిపోవడమే. దీనివల్ల గ్లోబల్ శుద్ధి చేసిన ఇంధన (రిఫైన్డ్ ఫ్యూయల్) మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు రష్యా, మిడిల్ ఈస్ట్‌లోని ప్రధాన రిఫైనరీలు, ఆయిల్ ఎక్స్‌పోర్ట్ మౌలిక సదుపాయాలకు ఆటంకాలు ఏర్పడటంతో డీజిల్ సరఫరా దారుణంగా పడిపోయింది. ఈ రవాణా, ఉత్పత్తి ఆటంకాలకు తోడు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో ఇంధన ధరలు సాధారణ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పుడు భారత్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పాడనుందా? ధరలు పెరుగుతాయా? అనే భయం పెరిగింది.

# ధాన్యం కొనుగోళ్లకు భారీ ఏర్పాట్లు!

మొదటి పేజీ తరువాయి

ధాన్యం నిల్వ సామర్థ్యంపై సమీక్షలో ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన నిల్వ స్థలాలను ముందుగానే గుర్తించాలని అధికారులకు సూచించారు. సాధారణ గోదాములతో పాటు ప్రస్తుతం వినియోగంలో లేని రైస్ మిల్లులు, ఇండస్ట్రియల్ షెడ్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలు, పెద్ద ఫంక్షన్ హాళ్లను కూడా తాత్కాలికంగా ధాన్యం నిల్వకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 65 లక్షల టన్నుల ధాన్యం ఒకేసారి మార్కెట్‌కు వచ్చిన సమయంలో నిల్వ సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు. తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కొర్ర లక్ష్మి కూడా సమావేశంలో పాల్గొని గోదాముల సామర్థ్యం, నిర్వహణ, రవాణా ఏర్పాట్లపై వివరాలు అందించారు.

ధాన్యం రవాణాలో సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించాలని అధికారులు నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించే ప్రతి వాహనానికీ జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయనున్నారు. దీంతో వాహనం ఎక్కడ ఉంది, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తోంది అనే వివరాలను పర్యవేక్షించడంతో పాటు ధాన్యం రవాణాలో పారదర్శకత పెంచే అవకాశం ఉంటుంది. క్షేత్రస్థాయిలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఫిజికల్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఈ యాప్ ద్వారా మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. కొనుగోలు ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు నకిలీ రశీదులు సృష్టించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు, జిల్లా మేనేజర్లు క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షలో వివరించారు. గుర్తించిన సమస్యలను కొనుగోళ్లు ప్రారంభమయ్యేలోపే పరిష్కరించాలని నిర్ణయించారు. కొత్త ఎస్‌హెచ్‌టీ విధానం, విస్తృత నిల్వ సదుపాయాలు, జీపీఎస్ ఆధారిత రవాణా, మొబైల్ యాప్ తనిఖీలతో ఈసారి ధాన్యం కొనుగోళ్లను మరింత వేగంగా, పర్యవేక్షణతో నిర్వహించేందుకు శాఖ సిద్ధమవుతోంది.

# సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్..

మొదటి పేజీ తరువాయి

సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతామని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు.

పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధంలేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం.. మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది.

సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

# కుప్పం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్!

**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** సుమారు రూ.45 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే ఈ పనులకు ప్రణాళిక శాఖ నుంచి స్పష్టమైన ఆమోదం దక్కింది. అయితే, కుప్పం ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా అడుగులు పడ్డాయి. ఇందులో భాగంగా సుమారు రూ.45 కోట్ల విలువైన పనులను నిరంతరం పర్యవేక్షించి పూర్తి చేసేందుకు ప్రణాళిక శాఖ ఆమోద ముద్ర వేసింది.

**489 పనులకు అనుమతులు మంజూరు**

స్థానిక అవసరాలు, ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుంటూ చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రతిపాదించిన మొత్తం 489 పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ నిధులతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో త్వరలోనే పనులు శరవేగంగా ప్రారంభం కానున్నాయి.

# కార్యకర్తలకు పేర్ని నాని పిలుపు!



**న్యూస్ డెస్క్, 20 సెప్టెంబరు (తెలుగు గళం):** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల మాదిరిగా కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి పేర్ని నాని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కేవలం ధన ప్రవాహమే కాకుండా, ఓటర్లతో మమేకమై వారి ప్రేమను సంపాదించుకోవడం ద్వారానే నిజమైన విజయం సాధ్యపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

మరోవైపు రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో యూరియా, డీఏపీ సకాలంలో దొరక్క రైతన్నలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని తెలిపారు. అన్నదాతలు తమ కష్టాలను చెప్పుకుంటూ తీవ్ర అగచాట్లు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు సులభంగా ఎరువులు పొందాల్సింది పోయి, యాప్‌ల ద్వారా మాత్రమే తెచ్చుకోవాలనే నిబంధనలు పెట్టడం మరింత క్షోభకు గురిచేస్తోందని పేర్ని నాని మండిపడ్డారు. ఈ విధానం వల్ల ఎరువుల కోసం రైతులు అధికారులను, సిబ్బందిని నిత్యం ప్రశ్నిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు.

# పేదింటి నుంచి వైద్య విద్య వైపు అడుగులు..

- ఎంబీబీఎస్ సీట్లు సాధించిన సుశీల్ చంద్ర, శైలు చంద్రికలకు ఘన సత్కారం
- విద్యార్థుల కృషి, పట్టుదలకు కాంగ్రెస్ నాయకుల అభినందనలు



**తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 20:**

ఏటూరునాగారం గ్రామానికి చెందిన వావిలాల సంధ్యారాణి--చిన్న ఎల్లయ్య దంపతుల పిల్లలు వావిలాల సుశీల్ చంద్ర, శైలు చంద్రికలు కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించడం పట్ల ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో, ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఆర్థిక పరిస్థితులను అడ్డంకిగా భావించకుండా పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సుశీల్ చంద్ర, శైలు చంద్రికలు క్రమశిక్షణతో చదివి వైద్య విద్యలో సీట్లు సాధించడం అభినందనీయమని, వారి విజయం తల్లిదండ్రుల కృషికి, విద్యార్థుల పట్టుదలకు నిదర్శనమని అన్నారు. విద్య ద్వారా వ్యక్తి జీవితంతో పాటు కుటుంబ భవిష్యత్తు కూడా మారుతుందని పేర్కొన్నారు. ఈ విజయం ఏటూరునాగారం ప్రాంతంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా సెక్రటరీ ఎండి ఖలీల్ ఖాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండి తాజొద్దీన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, డివిజన్ ఆత్మ చైర్మన్ కర్ల అరుణ, ఆర్టీఏ మెంబర్ వసంత శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు కె. రంజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు సర్వ అక్షిత్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గద్దల నవీన్, యూత్ మండలాధ్యక్షుడు గంట ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలుకల మందు తాగిన వివాహిత మృతి

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**
**పర్వతగిరి పోలీసుల కేసు నమోదు**

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి, సెప్టెంబర్ 20**

వినాయక చవితి సందర్భంగా పుట్టింటికి వచ్చిన ఓ వివాహిత ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన ఓర్సు విజయ్, కొమురయ్య కుమారుడు, 36 సంవత్సరాలు, వడ్డెర కులానికి చెందిన సబ్‌కాంట్రాక్టర్. ఆయన సోదరి శివరాత్రి అనూష అలియాస్ కవిత (32)కు సాంబరాజుతో వివాహమైంది. వినాయక చవితి సందర్భంగా అనూష తన స్వగ్రామమైన ఏనుగల్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఇంటి పక్కన ఉన్న వారిలో ఒకరితో మాట్లాడి, మరొకరితో ఎందుకు మాట్లాడటం లేదంటూ భర్త మందలించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 15న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో అనూష ఎలుకల మందు తాగినట్లు భర్తకు తెలిపింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిగ్మా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అనూష మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి సోదరుడు ఓర్సు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా అహ్మదియ్య ముస్లిం మహిళల జిల్లా వార్షిక సమావేశాలు




**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/ఆత్మకూరు, సెప్టెంబర్ 20**

అహ్మదియ్య ముస్లిం మహిళలు, బాలికలలో విద్య, ఆధ్యాత్మికత, ధార్మిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా వార్షిక సమావేశాలను ఆదివారం ఆత్మకూరు మండలం హౌజుబుజుర్గ్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ అహ్మదియ్య ముస్లిం మహిళల, బాలికల సమితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు గ్రామాల నుంచి మహిళలు, బాలికలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా జమాఅత్ మహిళల సమితి అధ్యక్షురాలు ఆయిషా అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సమావేశాలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా మహిళలు, బాలికలకు విద్యా, ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలపై వివిధ పోటీలు నిర్వహించడంతో పాటు ఉత్సాహాన్ని పెంపొందించేలా ఆటల పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ మహిళల పాత్ర కుటుంబం, సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని అన్నారు. ఖుర్‌ఆన్, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం వారి బోధనల వెలుగులో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం కల్పించబడిందని తెలిపారు. తల్లుల మంచి శిక్షణతో పిల్లలు సన్మార్గంలో నడిచి, మంచి కుటుంబాలు, సమాజం, దేశ నిర్మాణానికి దోహదపడతారని పేర్కొన్నారు. "తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది" అనే ప్రవక్త బోధనను ప్రస్తావిస్తూ..పిల్లల శిక్షణను ప్రతి తల్లి తన ఒడిలో నుంచే ప్రారంభించి, వారిలో మానవీయ విలువలు, నైతికత, ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే ఉత్తమ సంతానాన్ని తీర్చిదిద్దడంలో తల్లుల బాధ్యత ఎంతో గొప్పదని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలు, బాలికలకు బహుమతులు అందజేశారు. జిల్లా, గ్రామాల కమిటీ సభ్యురాళ్లు ఫర్జానా, ఆఫియా ఫాతిమా, మెహ్రున్నిసా, నజీమా, రేహానా, అలీమాబేగం, నజీమాబేగం, అజీమాబేగం, ఫరీదాబేగం, రెహానాబేగం, సమీప, ఖతీజా, అంకూస్ బి, మదీహ, అమీనా, అలీమ, కరిష్మా, యాస్మీన్, సుల్తానా, అనూష, మున్నీషాబేగం, సాలిహ, గోరీబి, కరీంబీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనతో వార్షిక సమావేశాలు ముగిశాయి.

# పాలకుర్తిలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి, సెప్టెంబర్ 20**



పాలకుర్తి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ రోడ్డులో గజానన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కమిటీ సభ్యులు సమష్టిగా ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

# ఉపాధి పనులు కల్పించాలి: సీపీఐ

**వ్యవసాయ కూలీలకు పనుల్లేక ఇబ్బందులు**
**రోజువారీ కూలి రూ.800 చెల్లించాలని డిమాండ్**



**జఫర్‌గడ్, సెప్టెంబర్ 20 (తెలుగుగళం)**

మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు వడ్లకొండ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జఫర్‌గడ్ మండల కేంద్రంలో సీపీఐ కార్యకర్తల సమావేశం ఎండీ యాకూబ్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వడ్లకొండ సుధాకర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో పంటల విస్తీర్ణం తగ్గిపోవడంతో వ్యవసాయ కూలీలకు తగినంత పనులు లభించడం లేదన్నారు. పనులు లేకపోవడంతో కూలీ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. మండలంలోని వ్యవసాయ కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా పనులు కల్పించడంతో పాటు పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు అవసరమైన పనిముట్లు అందించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా రోజువారీ ఉపాధి కూలిని రూ. 800కు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఏడాదికి కనీసం 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి కూలీల సమస్యలను పరిష్కరించకపోతే వారిని సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సుధాకర్ హెచ్చరించారు. సమావేశంలో వేల్పుల పెదరాములు, అన్యపు అజయ్, కొంతం రాజు, అన్నెపు విష్ణు రాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 17 నూతన మీ-సేవా కేంద్రాల ఏర్పాటుకు నియామక పరీక్ష

**తెలుగు గళం న్యూస్ జనగామ, సెప్టెంబర్ 20**



జిల్లాలో 17 నూతన మీ-సేవా కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ కోసం నియామక రాత పరీక్ష ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నియామక ప్రక్రియకు మొత్తం 663 దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 638 మంది అభ్యర్థులు పరీక్షకు అర్హత సాధించారు. వీరిలో 584 మంది పరీక్షకు హాజరుకాగా, 54 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో డీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్‌లో ఘనంగా ప్రవక్త మహమ్మద్ జీవిత స్మరణ సభ

## అహ్మదీయా ముస్లిం జమాత్ ఆధ్వర్యంలో నిర్వహణ..సుమారు 1,200 మంది హాజరు




**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 20**



హైదరాబాద్ సైదాబాద్‌లోని మస్జిద్ ఉల్ హమ్ద్‌లో అహ్మదీయా ముస్లిం జమాత్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రవక్త మహమ్మద్ ముస్తఫా పవిత్ర జీవిత స్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ప్రవక్త జీవిత విశేషాలు, బోధనలు, ఆదర్శాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జాతీయ ప్రతినిధి రఫీక్ అహ్మద్ బేగ్ అధ్యక్షత వహించారు. హైదరాబాద్ స్థానిక జమాత్ నాయకుడు తన్వీర్ అహ్మద్ సాహెబ్, హైదరాబాద్ జిల్లా జమాత్ నాయకుడు హమీదుల్లా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రవక్త మహమ్మద్ పవిత్ర జీవితం, మానవాళికి ఆయన అందించిన బోధనలు, ప్రేమ, శాంతి, సేవా భావం, సోదరభావం వంటి విలువలపై ప్రసంగించారు. సమాజంలో శాంతి, పరస్పర గౌరవం, మానవ సేవా భావాలను పెంపొందించుకోవడానికి ప్రవక్త జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించి మానవాళి పట్ల ప్రేమతో వ్యవహరించాలని, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయాలని, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పురుషులు, మహిళలు, కుటుంబాలు, చిన్నారులు సహా సుమారు 1,200 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో మస్జిద్ ఉల్ హమ్ద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమాన్ని నిర్వాహకులు క్రమశిక్షణతో నిర్వహించారు. హాజరైన వారికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రవక్త మహమ్మద్ జీవితం ప్రేమ, శాంతి, సేవ, సోదరభావానికి మానవాళికి మార్గదర్శకమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఘనంగా అన్నం బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలు

**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 20**




కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, తమ్మడపల్లి జి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రియ సన్నిహితుడిగా ఉన్న అన్నం బ్రహ్మారెడ్డికి పలువురు నాయకులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ గ్రామం, నియోజకవర్గ అభివృద్ధికి అన్నం బ్రహ్మారెడ్డి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్‌లో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నం బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య విమానాశ్రయంగా నామకరణం చేయాలి

**--- జి.ఎం.పి.ఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్**

**తెలుగు గళం న్యూస్ వరంగల్, సెప్టెంబర్ 20**

మామునూరులో నిర్మించనున్న వరంగల్ విమానాశ్రయానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జి.ఎం.పి.ఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విమానాశ్రయానికి పేరు సూచించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలను కోరిన నేపథ్యంలో దొడ్డి కొమురయ్య పేరును పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ కోరారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయి, భూమిని భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థకు అప్పగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జి.ఎం.పి.ఎస్ ఈ డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. తెలంగాణ రైతాంగ చరిత్రలో దొడ్డి కొమురయ్యకు ప్రత్యేక స్థానం ఉందని రవిందర్ పేర్కొన్నారు. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని తెలిపారు. ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం సాగిన పోరాటానికి దొడ్డి కొమురయ్య అమరత్వం ప్రతీకగా నిలిచిందన్నారు. వరంగల్ ప్రాంతానికి చెందిన చారిత్రక వ్యక్తి పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర, సామాజిక న్యాయ విలువలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే అవకాశం ఉంటుందని రవిందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సైతం నాటి పోరాట అమరుల స్ఫూర్తి దోహదపడిందని పలు సందర్భాల్లో రాజకీయ నాయకులు పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కోటి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు, ములుగు గిరిజన విశ్వవిద్యాలయానికి సమ్మక్క--సారలమ్మ పేరు పెట్టడాన్ని అభినందించిన ఆయన, తెలంగాణ చరిత్రలో ప్రజా పోరాటాలు, సామాజిక ఉద్యమాలకు ప్రతీకలుగా నిలిచిన వ్యక్తులకు గుర్తింపు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను గౌరవించినట్లవుతుందని పేర్కొన్నారు. విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యానికి సంబంధించిన మౌలిక వసతి మాత్రమే కాదని, వరంగల్ చారిత్రక, సామాజిక గుర్తింపును ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా కూడా నిలుస్తుందని అన్నారు. అందువల్ల విమానాశ్రయానికి పేరు నిర్ణయించే సమయంలో తెలంగాణ ఉద్యమం, రైతాంగ పోరాటం, సామాజిక చరిత్రకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దొడ్డి కొమురయ్య విమానాశ్రయంగా నామకరణం చేయాలని జి.ఎం.పి.ఎస్ రాష్ట్ర కమిటీ తరఫున ఉడుత రవిందర్ కోరారు.



గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (GMPS)
(రి.నెం.3104)
ఆఫీస్ అడ్రస్:-1-7-130/5/ఎ, రీసాలగడ్డ, జమిస్తాన్‌పూర్, ముషీరాబాద్, హైద్రాబాద్.
e-mail:-telanganagmps@gmail.com, tggmps@gmail.com Cell No.9490098487
అధ్యక్షులు: కిల్లె గోపాల్ ప్రధాన కార్యదర్శి: ఉడుత రవిందర్

వరంగల్ విమానాశ్రయానికి
"దొడ్డి కొమురయ్య విమానాశ్రయం" గా నామకరణం చేయాలి
-GMPS రాష్ట్ర కమిటీ డిమాండ్

వరంగల్ మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జి.ఎం.పి.ఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

వరంగల్ విమానాశ్రయానికి పేరు సూచించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి ప్రజలను కోరిన నేపథ్యంలో, దొడ్డి కొమురయ్య పేరును పరిశీలించాలని జి.ఎం.పి.ఎస్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయి, భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ ప్రకటన విడుదల చేశారు. వరంగల్ కేంద్రంగా నూతనంగా ప్రారంభించనున్న ఎయిర్‌పోర్ట్‌కు మంచి పేరును సూచించమని ముఖ్యమంత్రి ప్రజల అభిప్రాయాలు అడగడం ఆహ్వానిస్తున్నాము.

దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ చరిత్రలో చిరస్మరణీయమైన పేరు. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో నిలిచారు. ఆయన అమరత్వం తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం సాగిన పోరాట చరిత్రకు ప్రతీకగా నిలిచింది. వరంగల్ ప్రాంతానికి చెందిన ఒక చారిత్రక వ్యక్తి పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా తెలంగాణ చరిత్ర, రైతాంగ పోరాట వారసత్వం, సామాజిక న్యాయ విలువలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే అవకాశం ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి, అలాగే ఆ ఉద్యమానికి నాటి తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తి ఉపయోగపడిందని అన్ని పార్టీల నేతలు అనేక సందర్భాల్లో చెప్పి ఉన్నారు. ఆ అమరుల త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ ఊపిరి తీసుకుంటుందని తెలిపారు.

ప్రభుత్వం గతంలో కోటి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి ఐలమ్మ పేరు పెట్టడం, ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయానికి సమ్మక్క సారలమ్మ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. వీటివల్ల ప్రజాస్వామ్యాన్ని, ప్రజల పోరాటాలను గౌరవించినట్లుగా ఉందని భావిస్తున్నాము. తెలంగాణ అంటేనే రాచరికానికి, దొరతనానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపిన చైతన్యవంతమైన నేల అన్నారు. అలాంటి నేలకు మళ్లీ రాచరికపు రాజులు, రాణుల పేర్లు పెట్టాలని చర్చ చేయడం సరికాదన్నారు. విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యానికి సంబంధించిన మౌలిక వసతి మాత్రమే కాకుండా, వరంగల్ చారిత్రక సామాజిక గుర్తింపును ప్రపంచానికి పరిచయం చేసే ఒక ముఖ్యమైన వేదికగా మారనున్నందున, దానికి పేరు పెట్టే విషయంలో తెలంగాణ ఉద్యమ, రైతాంగ, సామాజిక చరిత్రకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దొడ్డి కొమురయ్య పేరును అంతిమ నిర్ణయంగా తీసుకోవాలని కమిటీ కోరింది.

అభినందనలతో...
తేది. 20.09.2026
హైదరాబాద్.
(ఉడుత రవిందర్)
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9490098487

# అమలాపురంలో ఇంట్లో పేలుడు ఘటన



**అమలాపురం (తెలుగు గళం) సెప్టెంబర్ 20 :** అమలాపురం పట్టణంలోని స్థానిక మహిపాలవీధిలో మలిశెట్టి మూర్తి ఇంట్లో పేలుడు సంభవించడంతో కలకలం రేగింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయాలు అయ్యాయి చికిత్స కోసం ఆసుపత్రి కి తరలించారు.

పేలుడు సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు దారితీసిన కారణాలపై ప్రాథమికంగా పరిశీలన చేపట్టారు. పేలుడుకు అసలు కారణాలను నిర్ధారించేందుకు ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తారని డీఎస్పీ తెలిపారు. ఫోరెన్సిక్ నివేదిక అనంతరం పేలుడుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు అన్నారు .

# “మతాలు వేరైనా.. మనసులు ఒక్కటే”

**గణేష్ ఉత్సవాల్లో మతసామరస్యానికి ప్రతీకగా మహా అన్నదానం**
**అన్నదానంలో పాల్గొన్న ముస్లిం సోదరులు**
**జామా మసీదు కమిటీ అధ్యక్షుడికి ఘన సన్మానం**





తెలుగు గళం ఏటూరునాగారం సెప్టెంబర్ 20:

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి అన్నదానంలో పాల్గొనడం ద్వారా సోదరభావం, సామాజిక ఐక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం జామా మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అబ్జల్ పాషాను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కిశోర్ కుమార్, రంజిత్, చిన్ని కృష్ణ, శ్రీను, కందకట్ల శ్రీను, ప్రసాద్, కళ్యాణ్, అన్వర్, అలీ, అఫ్రిది, బాబా, చోటు, మహేమూద్, సోనూ, అఫ్రాజ్ తదితరులు పాల్గొన్నారు. “మతాలు వేరైనా.. మనసులు ఒక్కటే” అనే సందేశాన్ని చాటుతూ జరిగిన ఈ మహా అన్నదానం ఏటూరునాగారంలో మతసామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది.

# గంగుగూడెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం

**తల్లిపాలతో పాటు పోషకాహారం అందించాలి**
**1000 రోజుల ప్రాముఖ్యతపై అవగాహన**



తెలుగు గళం కన్నాయిగూడెం, ములుగు, సెప్టెంబర్ 20:

కన్నాయిగూడెం మండలం గంగుగూడెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పవతి మాట్లాడుతూ గర్భం దాల్చిన రోజు నుంచి బిడ్డకు రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉన్న తొలి 1000 రోజులు ఎంతో కీలకమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చున్నారు. పిల్లలకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచి, స్థానికంగా లభించే పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని సూచించారు. రాజన్నపేట సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం తల్లులతో పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సమ్మక్క, వెంకటేశ్వరమ్మ, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఖండించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

**ఏటూరునాగారం -బ్రాహ్మణపల్లి రహదారికి రూ.44 కోట్లు**
**వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం**



తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 20:

మంగపేట మండలం కమలాపురం గ్రామంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సమావేశానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో ఏటూరునాగారం నుంచి బ్రాహ్మణపల్లి వరకు రహదారి నిర్మాణానికి రూ. 44 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ప్రభుత్వ అనుమతులు పూర్తయ్యాయని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై వాస్తవాలు తెలుసుకోకుండా బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సోమయ్య ఖండించారు. ప్రజలు అపోహలకు గురికావద్దని, యువత రాజకీయ ప్రచారాలకు ప్రభావితం కాకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అయ్యోరి యానయ్య, చౌలం వెంకటేశ్వర్లు, బాడిషా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మైదుకూరు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో గుర్తింపు కార్డుల పంపిణీ..!



తెలుగు గళం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 20: రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మైదుకూరు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఐడెంటిటీ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మైదుకూరు మాజీ శాసనసభ్యులు రఘురామిరెడ్డి గారి చేతుల మీదుగా పార్టీకి చెందిన వివిధ స్థాయిల కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర, జిల్లా, డివిజన్, అసెంబ్లీ మరియు మున్సిపాలిటీ కమిటీల నాయకులకు, కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులందరూ ఐక్యంగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా పార్టీ తరఫున ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని ఈ సందర్భంగా పత్రికల ద్వారా రఘురామిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హలో ఉద్యమకారుడా..27న చలో యాదగిరిగుట్ట

**-- టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్**



తెలుగు గళం న్యూస్ జనగామ సెప్టెంబర్ 20

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్నట్లు టీయూఎఫ్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జిల్లా ఉద్యమకారులతో కలిసి ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల స్థాయిలో పర్యటిస్తూ ఉద్యమకారులను ఐక్యం చేస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. టీయూఎఫ్ నిరంతర పోరాటాల ఫలితంగా ఉద్యమకారులకు సంబంధించిన హామీల అమలుపై కమిటీ ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న యాదగిరిగుట్టలో జరిగే ఆవిర్భావ దినోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఉద్యమకారులు రాజకీయాలకు అతీతంగా తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరు కావాలని యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి సభకు హాజరవుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యమకారులు తమ వద్ద ఉన్న ఉద్యమ చరిత్రకు సంబంధించిన పత్రాలు, ఎఫ్ఐఆర్ కాపీలు, జైలు శిక్షల వివరాలు, అమరుల కుటుంబాల వివరాల జిరాక్స్ ప్రతులను సభ వద్ద కమిటీ సభ్యులకు సమర్పించాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జోగు అంజనేయులు, నాగరాజు, దయానంద్, జగన్, ఆర్.కే. భూపాల్, మహిళా రాష్ట్ర కమిటీ ప్రతినిధి శ్యామల, సోమాపురం శంకర్, సిద్దులు, చంద్రభాను, జనగామ మాజీ జిల్లా అధ్యక్షుడు తిప్పారపు ఆనంద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్, బోడ రమేష్, నియోజకవర్గ కన్వీనర్ కడింగుల బాలకృష్ణ, బొల్లం భాస్కర్, లాజర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం మహిపాల వీధిలో భారీ పేలుడు

## ధ్వంసమైన ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు



అమలాపురం (తెలుగు గళం), సెప్టెంబర్ 20: అమలాపురం మహిపాల వీధిలో మలిశెట్టి మూర్తి మాస్టర్ నివాసంలో భారీ పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసమైన ఇంటిని పరిశీలించారు. పేలుడు ధాటికి ఇంటి కిటికీలు ఊడిపడగా, పై అంతస్తులోని బెడ్‌రూమ్‌లో ఉన్న మూర్తి మాస్టర్ ఇద్దరు కుమారులు బయటకు ఎగిరిపడ్డారు. వారిలో ఒకరు గాయపడటంతో ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పేలుడుకు గ్యాస్ సిలిండర్ కారణమా, పిడుగు పడటమా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అసలు కారణాన్ని నిర్ధారించేందుకు రాజమండ్రి నుంచి ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించనున్నారు.

# ఐ. పోలవరం మండలంలో స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమం





ఐ. పోలవరం(తెలుగు గళం)సెప్టెంబర్ 20 : ఐ. పోలవరం మండలంలోని కొమరగిరి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ గుత్తుల సాయి , మండల పార్టీ అధ్యక్షులు శ్రీ సాగిరాజు, సూరిబాబు రాజు , ఇతర కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. స్వచ్ఛతను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలు, అధికారులు, నాయకులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, స్వచ్ఛమైన గ్రామాలు -- ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# రాపూరులో అర్ధరాత్రి పిడుగుపాటు

**రూ.2 లక్షల ఆస్తి నష్టం**
**మూడంతస్తుల భవనం పాక్షికంగా ధ్వంసం**



నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం):-నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలోని కాపు వీధిలో శనివారం అర్ధ రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కాపు వీధికి చెందిన బత్తిన పెంచలరెడ్డి మూడంతస్తుల భవనంపై అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా పిడుగు పడింది. ఈ ఘటనలో భవనం మూడో అంతస్తు భాగం పాక్షికంగా దెబ్బతింది. పిడుగుపాటు తీవ్రతకు భవనం పైభాగం విరిగిపడటంతో పాటు ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలన్నీ పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు భవన యజమాని పెంచలరెడ్డి తెలిపారు. పిడుగు పడిన సమయంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో కాపు వీధి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ప్రమాద సమయంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో ప్రజలు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

# పోచారంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



ఘట్‌కేసర్,తెలుగు గళం: కుటుంబ కలహాల కారణంగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటీకారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం డివిజన్ సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సంతోష(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శనివారం రాత్రి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతురాలి భర్త కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.